క్లుప్తంగా

లలిత రాజరాజేశ్వరీదేవి ఆలయ నిర్మాణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాల ఎదురుగా ఉన్న హనుమాన్ దేవాలయంలో లలిత రాజరాజేశ్వరి దేవి ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎ.వెంకటకృష్ణారావు(బబ్లు), ప్రధాన కార్యదర్శి వెంకటరావు, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షులు శేఖర్, అర్చకులు నాగరాజు శర్మలు తెలిపారు. సోమవారం వారు ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. వైశాఖ మాసంలో ఆలయాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం స్థానికులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.దామోదర్‌రెడ్డి, ఎ.కిషన్‌రావు, ఆర్.సంతోష్‌గౌడ్, రాజు, కృష్ణ, అడ్వకేట్ హరీష్ తదితరులున్నారు.

పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు



బాగ్‌లింగంలిపల్లి ఎంఐజీ-2 పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి ఎంఐజీ-2 పార్కు వెల్ఫేర్ అసోసియేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా జె.రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.శేషయ్య, సహాయ కార్యదర్శిగా సారా శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.జే.జోషఫ్, కార్యవర్గ సభ్యులుగా జి.రాం మోహన్‌రెడ్డి, నారాయణ, పి.శంకర్, ఎం.నర్సప్ప, జి.నర్సింహ్మాచారి, ఎం.రవి, బిల్డర్ శంకర్, నాగేశ్వర్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, రత్నాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎంఐజీ-2లో ఉన్న మదర్ డెయిరీ పార్కులో అసంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయని ఇక్కడ స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు.

ప్రముఖ రచయిత్రి యశోదారెడ్డికి నివాళి



యశోదారెడ్డికి నివాళులర్పిస్తున్న దయానంద్, జనార్ధనమూర్తి

చిక్కడపల్లి: తెలంగాణ సాహిత్యంలో తొలితరం రచయిత్రి యశోదారెడ్డి అని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం కవయిత్రి, కథారచయిత్రి పాకాల యశోదారెడ్డి జయంతి సభ అధ్యక్షుడు కళా జనార్థనమూర్తి అధ్యక్షతన జరిగింది. నవల, కథ, కవిత తదితర సాహితీ ప్రక్రియల్లో తెలంగాణ మాండలిక పదాలను ప్రయోగాత్మకంగా ఉపయోగించే సాహితీవేత్త యశోదారెడ్డి అన్నారు. కార్యక్రమంలో రమణ వెలమకన్ని, వైఎస్ఆర్ మూర్తి, కొల్లి నాగేశ్వర్‌రావు, చక్రపాణి పాల్గొన్నారు.

గొప్ప విప్లవోద్యమ నాయకుడు సత్యనారాయణసింగ్



సత్యనారాయణసింగ్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సాదినేని వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారతదేశ కమ్యూనిస్టు విప్లవ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకుడు సత్యనారాయణ సింగ్ అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి తెలంగాణ రాష్ట్రకార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్లు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో న్యూడెమాక్రసి అగ్ర నాయకుడు సత్యనారాయణసింగ్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణసింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి తన తుది శ్వాస విడిచే వరకు విప్లవ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసి కేంద్ర కమిటీ నాయకుల్లో ఒకరైన నారాయణసింగ్ పీడిత ప్రజల కోసం చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. న్యూ డెమాక్రసి రాష్ట్ర నాయకులు జె.వి.చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేములపల్లి వెంకటరామయ్య పాల్గొన్నారు.

ఏడాదిగా కలుషిత మంచినీటి సరఫరా

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు



చిక్కడపల్లిలో కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్న స్థానికులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని సోప్ ఫ్యాక్టరీ లేన్ స్ట్రీట్ నెంబర్ 10లో గత ఏడాది కాలంలో కలుషిత మంచినీటి సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని స్థానికులు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి జలమండలి అధికారిని పిలిపించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా గత 40 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్‌లు కావడంతో మురికి నీరు సరఫరా అవుతోందని వెంటనే కొత్త పైపులైన్‌లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఏడాది కావస్తున్నా ఇంత వరకు అధికారులు స్పందించలేదు. ఇప్పటికీ కలుషిత నీరే సరఫరా అవుతుంది. సుమారు అక్కడ వెయ్యి మందికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సోమవారం స్థానిక నాయకులు కొందరు కృష్ణ ఆధ్వర్యంలో జలమండలి మేనేజర్ జ్యోతికి విన్నవించి మా బస్తీలో పర్యటించాల్సిందిగా కోరారు. సంబంధిత అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని కలుషిత నీటి సరఫరా గురించి ఆరా తీశారు. వెంటనే అక్కడకు వచ్చిన స్థానికులు గత ఏడాది కాలంగా మంచినీటిలో మురుగు నీరు వస్తున్నా మీరు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చెప్పినా మీరు వినరా అంటూ నిలదీశారు. అంతే కాకుండా మీరు ఈ నీరు తాగండి మీకే తెలుస్తుందని అని జలమండలి అధికారి జ్యోతిని ప్రశ్నించగా వారికి సమాధానం చెప్పలేక అక్కడి నుంచి వెళ్లిపోవడంగమనార్హం. స్థానికులంతా మాకు న్యాయం చేయాలని మంచి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. జలమండలి అధికారులు సమాధానం చెప్పకుండా మిన్నకుండా వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యేతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. స్థానికులు సత్యనారాయణ, మాధవి, మల్లైకాబేగం, రేణుక, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సాయన్నకు ప్రముఖుల నివాళి



సాయన్న భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న భౌతికకాయానికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఉదయం అశోక్‌నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సాయన్న మంచి మనిషి అని ఆయన అందరితో కలసిమెలసి ఉండేవారని గుర్తుచేశారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాష్, మంత్రులు సత్యవతిరాథోడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాధవరం కృష్ణారావు, ముఠాగోపాల్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, వివేక్ వెంకటస్వామి, అల్లాడి రాజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ చైర్మన్ డాక్టర్ బానోత్ రమణానాయక్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతశివకుమార్ తదితరులు సాయన్న భౌతికకాయానికి నివాళులర్పించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత కదలాలి



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత కదలాలని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నాగేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన మాట్లాడే స్వేచ్ఛను, ప్రశ్నించే తత్వాన్ని ఈ రోజు పాలకులు జీవర్జించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టును సైతం ప్రశ్నిస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువత భగత్‌సింగ్ ఇచ్చిన విలువలను ముందుకు తీసుకువెళ్లేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ మాజీ నగర నాయకులు పార్థసారధి, నాయకులు అంజయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేరళ మత్స్య ఫెడ్ చైర్మన్ మనోహరన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల కుటుంబాల సంక్షేమానికి, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ఐదు వేల కోట్లు నిధులు కేటాయించాలని కేరళ మత్స్య ఫెడ్ చైర్మన్ వి.మనోహరన్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో మత్స్య సొసైటీ అధ్యక్షుల రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న మనోహరన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పది లక్షల మత్స్యకారుల కుటుంబాలు ఉన్నాయని కరోనా నేపథ్యంలో మూడు సంవత్సరాల నుంచి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రతి మత్స్య సొసైటీకి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని, రెండవ విడతగా సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా మత్స్యకారులకు 34 రకాల సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి లెల్లల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు దేబ్‌శేషుబర్మన్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.స్టాన్లీ పాల్గొన్నారు.

నేటి నుంచి ఖేలో తెలంగాణ.. జీతో తెలంగాణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం నగర అధ్యక్షులు మద్దూరి శివాజీ

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా అట్టడుగున ఉన్న క్రీడాకారులను వెలికి తీసి వారిలో ఉన్న ప్రాచీణ్యాన్ని మరింత వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు పార్లమెంట్ నియోకవర్గాల వారిగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మహంకాళి జిల్లా బీజేవైఎం నగర అధ్యక్షులు మద్దూరి శివాజీ, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్‌లు తెలిపారు. రాజాడిలక్స్ చౌరస్తా వద్ద గల బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ క్రీడా పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 48 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటాయని, మూడు రోజుల పాటు ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్, దోమలగూడ గగన్‌మహల్ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సారథ్యంలో క్రీడాకారులకు కావాల్సిన సామాగ్రి కల్పిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ కె.రవిచారి, మహంకాళి జిల్లా పరధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్‌లు అన్నారు. సోమవారం విద్యానగర్‌లో మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ మీద ఆధారపడి తమ చదువులు కొనసాగిస్తున్న నిరుపేదల విద్యార్థులకు నాలుగేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను ముప్పు తిప్పలు పెడుతుందన్నారు. కాంపాటి పృధ్వీ, అనిల్, సంధ్య, సాయి, ప్రవీణ్, సురేష్, సీతారం, వెంకటేష్, అజయ్, గణేష్, సంతోష్, దీపిక, రాకేష్, తిరుపతి, అషుర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోంది

రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్



మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు , రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లో ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నియోజవర్గంలో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. కార్పొరేటర్ ఎ.పావని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషిచేస్తున్నామన్నారు.

డిప్యూటేషన్ రద్దుచేయండి



బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్

ముషీరాబాద్: రంగారెడ్డి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ నుంచి మేడ్చల్ జిల్లాకు డిప్యూటేషన్‌పై పంపిన సీనియర్ అసిస్టెంట్‌ను తిరిగి రంగారెడ్డి జిల్లా బీసీ అభివృద్ధి శాఖకు రప్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రంగారెడ్డి జిల్లాలో సిబ్బంది కొరత ఉందని కావున డిప్యూటేషన్‌ను రద్దు చేసి రంగారెడ్డి జిల్లాలోనే సీనియర్ అసిస్టెంట్‌ను కొనసాగించాలని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లాలో ఎస్టాబిలిషన్‌మెంట్ సెక్షన్‌ను జూనియర్ అసిస్టెంట్‌లకు ఇచ్చారని, సీనియర్ సీనియర్ అసిస్టెంట్ చేయాల్సిన ఈ సెక్షన్ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్ చేయడంతో ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

కాచిగూడ: దేశ జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ తమ స్వలాభం కోసం వివిధ పార్టీల నాయకులు బీసీల ఓట్లను కొల్లగొట్టేందుకు మండల్ కమిషన్ పేరును వాడుకుంటూ బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆయా పార్టీల ప్రతినిధులకు రానున్న ఎన్నికల్లో బీసీలందరూ సంఘటితంగా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. 40 సంవత్సరాలైనా ఇప్పటి వరకు మండల్ కమీషన్ సిఫార్సులు అమలు కాకపోవడం బాధాకరమని అన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి వినతి

లాలాపేట: ఆస్పత్రి నిర్మాణం చేయాలంటూ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అఖిల పక్ష నాయకుల బృందం సోమవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ నిర్మాణంలో కూలీలుగా ఉన్న తమ పూర్వీకులు, అప్పటి నిజాం సర్కార్ కూలీల నివాసం కోసం కొంత స్థలాన్ని కేటాయించిందన్నారు. అప్పటి నుంచి అదే ప్రాంతంలో కష్టనష్టాలకు ఓర్చి నివాసాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు.

ప్రస్తుతం 30 వేల జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ఆస్పత్రి లేకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాణికేశ్వర్‌నగర్(వడ్డెర బస్తీ)లో కమాన్ పక్కనున్న ఖాళీ స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేయాలని కోరారు.

నామినేషన్ వేసిన మాణిక్‌రెడ్డి



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న దృశ్యం

కవాడిగూడ: విద్యా రంగం అభివృద్ధికి, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమానికి మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ శాసన మండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న టీఎస్ యుటీఎఫ్ సీనియర్ నాయకులు పాపన్నగారి మాణిక్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు ఇందిపార్కు ధర్నా చౌక్‌లో జరిగిన సభలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు కె.జంగయ్య అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యరంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రశ్నించే గొంతులను శాసన మండలికి పంపాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుంచి ఇందిరా పార్కు చౌరస్తా, దోమలగూడ, గగన్‌మహల్ మీదుగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

నియామకాల్లో అవకతవకలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాలిపల్లి కృష్ణ, ఇందిర

కాచిగూడ: జీహెచ్ఎంసీ అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న స్వీపర్ అండ్ కామాటి ఉద్యోగాల్లో స్థానిక అధికారుల అండదండలతో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, ఈ విషయంలో తగు విచారణ చేపట్టి అర్హులైన వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గాలిపల్లి కృష్ణ, రాష్ట్ర అధ్యక్షురాలు బి.ఇందిర, ప్రధానకార్యదర్శి జి.మల్లేష్, కె.బాబులు జీహెచ్ఎంసీ కమీషనర్‌కు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వీపర్స్, కమాటీలుగా పనిచేస్తూ చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉండగా కొత్తవారిని నియమిస్తున్నారని తెలిపారు.

కుంగిపోయిన మంచినీటి వాల్



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉమారమేష్ యాదవ్

కాచిగూడ: నింబోలిఅడ్డాలో మంచినీటి వాల్ కుంగిపోయి నీటి సరఫరా సరిగ్గా జరగకపోవడంతో మంచినీరు రాక స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మంచినీటి సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలుసుకుని సమస్యను సంబంధిత జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు సోమవారం సిబ్బందిని పంపించి మరమ్మత్తులు చేయించారు. పనులను కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ పర్యవేక్షించారు.

కరెంట్ కట్‌చేసి..ఇంట్లోకి చొరబడి.. స్నాచింగ్..

- 200 సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు
- మూడు బృందాలుగా జల్లెడ పట్టిన పోలీసులు
- ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్టు, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న కాచిగూడ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ మొగిలిచర్ల రవి

నల్లకుంట: ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను టార్గెట్ చేస్తూ విద్యుత్ మీటర్ ఫ్యూజ్‌లను తొలగించి ఇండ్లల్లోకి చొరబడి వినూత్న తరహాలో చైన్ స్నాచింగ్స్‌కు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను నల్లకుంట పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి మూడున్న తులాల చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సోమవారం నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మొగిలిచర్ల రవితో కలిసి కాచిగూడ ఏసీపీ ఎ. శ్రీనివాస్ చైన్ స్నాచింగ్ వివరాలు వెల్లడించారు. ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన పెనుపొత్తు శంకర వర ప్రసాద్ అలియాస్ శంకర్(39) నగరంలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేయడంతో పాటు ర్యాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తూ జగద్గిరీగుట్ట అంజయ్యనగర్‌లో నివాసముంటున్నాడు.

◆ సోదరుడి వరుసైన చెందిన కొకిరిగడ్డ శ్రీను(40) కాకినాడ పోర్టులో హౌజ్ కీపింగ్ పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. ఇద్దరూ కలిసి చోరీలు చేయాలని ప్లాన్ వేసుకున్నారు.విద్యానగర్‌లో ఓ ఇంట్లో ఇద్దరు వృద్ధ మహిళలు ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించారు. ఈ నెల 9న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వృద్ధులు నివాసముంటున్న ఇంటికి విద్యుత్ మీటరుకు ఉన్న ఫ్యూజ్‌ను తొలగించారు. ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో ఉన్న 3.5 తులాల బంగారు చైన్ తెంపుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సుమారు 200 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. నంబర్ ప్లేట్‌లేని ద్విచక్ర వాహనం జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌లో ఇంటి అడ్రస్‌తో రిజిస్ట్రేషన్ అయ్యిందని తెలుసుకున్నారు. పోలీసులు ఆ ప్రాంతంలో మాటు వేసి చిరునామా తెలుసుకు ఆదివారం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన విషయాన్ని అంగీకరించిన నిందితులు చోరీ సొత్తును ఈ నెల 11వ తేదిన ఈస్ట్ గోదావరి జిల్లాలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు ఇద్దరినీ వెంటనే జడ్జి ఎదుట హాజరు పరిచారు. అనంతరం న్యాయమూర్తి అనుమతితో విచారణ నిమిత్తం వారిని కస్టడీలోకి తీసుకొని సొత్తును రీకవరి చేశారు. సోమవారం సాయంత్రం నిందితులిద్దరినీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



గిరిజనుల మహా ధర్నాలో అభివాదం చేస్తున్న నాయకులు

కవాడిగూడ: ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హక్కు పత్రాలు ఇవ్వాలని పౌరహక్కుల సంఘం నాయకులు, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పోడు సాగుదారులందరికి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పోడు భూములకు పట్టాల కోసం సుదీర్ఘ కాలం ఆదివాసీలు ఉద్యమించడం విషాదకరమన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్, వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు.